

# 'అదే' కథలు

## - ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 80

## ఎండో ఫేక్టర్

**కంప్యూటర్ టెక్నాలజీ** బాగా ఊపందుకున్న రోజుల్లో మన పరేష్ అద్వానీ అనే సింధీ కుర్రాడు స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ దగ్గిర్లో తేలాడు. అబ్బే, అక్కడ మన వాడికి సీటు వచ్చేసి కాదు కానీ, కంప్యూటర్ పార్ట్ లు అమ్మడం లో పదిహేనేళ్ళకి ఓ పది మిలియన్లు సంపాదించాక, ఆ యూనివర్సిటీలో సాయంత్రం చెప్పే పార్ట్ టైమ్ మేనేజ్ మెంట్ క్లాసులకి. మూడు నెలలకి ఒక తెల్లమ్మాయి పరిచయం అయింది. ఆవిడ వయస్సు ఇరవై ఐదు లోపే గానీ మనవాడికి ముప్పై ఐదు దాటాయి. అయితే ఏమిటి, ప్రేమించుకోవడానికి అమెరికాలో వయస్సు అడ్డు రాదుగా? డబ్బై అయిదేళ్ళ టివి స్టార్లు, ఎనభై ఏళ్ళ సినిమా స్టార్లూ ఇరవై ఏళ్ళ అమ్మాయిలతో తిరగట్లేదా? అలా పరేష్ గారికి రీటా గారితో ఒకే ఇంట్లో ఉంటూ ఒకే మంచం మీద పడుకునే భాగ్యం కలిగింది. ఇటువంటి విషయాల్లో జీవితం సరదాగా గడుపుతారు జనం. మనం పెళ్ళి మాట ఎత్తరాదు అనవసరంగా. బాయ్ ఫ్రెండ్, గర్ల్ ఫ్రెండ్ అనే కొత్త కొత్త పదాలు కనిపెట్టి వాడుతున్నాంగా సమయానుకూలంగా, ఎవరి వీలు బట్టి వారు బతుకుతూంటే?

రీటా గారు మంచి తెలివైన అమ్మాయి. ఒక సెమెస్టర్ అవగానే ఏపిల్ కంప్యూటర్ కనిపెట్టిన స్టీవ్ జాబ్స్ లాగా మెడమీదకి వచ్చే షర్ట్ లు వేసుకోవడం, తానూ ఒక రోజు జాబ్స్ గారి లాగే గొప్పదై పోతున్నట్టూ కలలు కంటూ, ఒక రీసెర్చ్ ఐడియా సంపాదించింది. ఆ ఐడియా ప్రకారం మీరు రోడ్డు మీద ఉన్న ఏ షాపులో కైనా వెళ్ళి ఒకే ఒక రక్తం చుక్క – నిజంగానే ఒక్క చుక్క – ఇస్తే మీ వంట్లో ఉన్న, రాబోయే అన్ని రోగాలు చెప్పేసే యంత్రం కనిపెట్టేస్తారుట. అబ్బో దీనికి వెనక మహామహుల చేతులున్నాయి. వెంచర్ కేపిటలిస్టులందరూ కల్సి దీన్ని ఆకాశానికి ఎత్తేసి మిలియన్లు పెట్టారు పెట్టుబడి. రీటా గారూ, బాయ్ ఫ్రెండ్ పరేశ్ గారూ టింగు రంగా అంటూ ఎర్ర రిబ్బన్లు కత్తిరించి కంపెనీకి శంఖుస్థాపన చేస్సేరు సిలికాన్ వేలీలో. పరేష్ గారు ఓ పాతిక దేశీయులకీ, మరో పాతిక చైనా, వగైరా వారికీ ఎర చూపి హెచ్ వన్ వీసాలమీద అమెరికా రప్పించారు. ముందు చెప్పుకున్నట్టూ మీ రక్తం ఒకే ఒక్క చుక్క ఇస్తే మీ జాతకం అంతా చెప్పేసే యంత్రం తయారు చేయడానికి శరవేగంగా పని మొదలైంది. పరేష్ గారు సి. ఒ. ఒ. అంటే ఆపరేటింగ్ ఆఫీసర్. అమ్మగారు సి.ఇ.ఓ. ఇరవై ఐదేళ్ళ తెల్లమ్మాయిని సి.ఇ.ఓ గా పెడితే వచ్చే పేరు వేరు కాదూ?

కంపెనీలో మేనేజర్లు పని ఉన్నా లేకపోయినా చేసేది ఎప్పుడూ ఒకటే కదా – రోజువారీ మీటింగ్ లు పెట్టడం. అందులో ఒక్కొక్కరి ప్రోగ్రెస్, ఇప్పటివరకూ ఏం పని, దాని మీద ఎంత సమయం తగలేసారు, రేపు లేదా వచ్చే వారంలో ఎంత తగలేసి ఎలా అఘోరిస్తారనేవి చెప్పాలి. ఈ "ఒకే-ఒక చుక్క రక్తం" ప్రోజక్ట్ లో యంత్రానికి ఒక రోబోటిక్ చేయి ఉంటుంది. అది రక్తం చుక్కని ముట్టుకోకుండా లోపలకి పంపడం, మట్టీ, మశానం అవన్నీ చేసేది. అది రోబోటిక్ చేయి చివర్లో ఉంటుంది కనక ఇంగ్లీషులో దాన్ని ఎండ్ – ఎఫెక్టర్ (End effector) అనడం అలవాటైంది. రక్తంలో ఉండే సోడియం, పొటాషియం అనేవాటన్నిటికీ ఇంగ్లీషు పేర్ల బదులు పీరియాడిక్ టేబుల్ లో ఉన్న పేర్లు వాడతారు – Na, K అంటూ. పరేష్ గారు కంప్యూటర్ మార్కెటింగ్ లోంచి ఇందులోకి దూకారు కనక ఆయనకి ఇవన్నీ తెలియదు. తెలియకపోవడం తప్పుకాదు కానీ నేర్చుకోడు. బేంక్ లో మిలియన్లూ ఇంట్లో తెల్లమ్మాయి గర్ల్ ఫ్రెండ్ గా ఉండగా ఇంకా నేర్చుకునేదేవుంది, గాడిదగుడ్డు? అలా ఆయన ఒక మీటింగ్ లో పొటాషియం ని "పి" అనీ సోడియం ని "ఎస్" అనీ అనేసరికి మన దేశీయులకి ఒకటి అర్ధం అయింది. జేబులో డబ్బులున్నాయి కానీ మన పరేష్ ఓ పెద్ద వాజమ్మ. అక్కడ్నుంచి వాజమ్మ మీద జోకులు వేయడం – అదే ఆయన మొహం మీద కాదు కానీ పక్కనుంచి – సర్వసాధారణం అయింది.

మూడేళ్ళు గడిచాక ఒక విషయం బయటకి వచ్చింది – ఈ "ఒకే ఒక రక్తం చుక్క" తో పని అవదు. ఈ యంత్రం పనిచేసేది కల్ల. అయినా దీన్ని పట్టుకు వేలాడుతున్నారు పెద్దలంతా. పరేష్ గారు అన్నీ రీటాగారికి వదిలేసి రోజువారీ మీటింగ్ లు మాత్రం లాగిస్తున్నప్పుడు మన దేశీయులు ఒకమీటింగ్ లో 'ఎండ్-ఎఫెక్టర్' అనేది అదే పనిగా చెప్తూంటే సగం నిద్రలో ఉన్న పరేశ్ గారు దాన్ని "ఎండోఫేక్టర్" అనుకున్నారు. అప్పట్నుంచీ ఈయన "ఎండోఫేక్టర్" ఏమైంది,

"ఎండోఫేక్టర్" ఎంతరవరకూ వచ్చిందీ, అనేవి అడగడం నేర్చుకున్నాడు. అదను చూసి ఒక టీమ్ లీడ్ దేశీయులందర్నీ, చైనావార్నీ కలిపి ఒక సరదా మీటింగ్ పెట్టాడు. దానికి పరేష్ గారు వస్తాడు కూడా – ఆయనే కదండీ "ఎండోఫేక్టర్" అనేదాని గురించి చంపుకు తింటున్నాడు ప్రతీసారీ? మీటింగ్ ముందు మన టీమ్ లీడ్ అందర్తో చెప్పాడు కూడా – "మీరేం మాట్లాడకండి నేను చూసుకుంటాను. ఇది సరదాకి వీడెంత వాజమ్మో చూపించదానికే" అని. నవ్వు వచ్చినా ఎవరూ నవ్వరాదు మీటింగ్ లో. అలా "ఎండోఫేక్టర్ అప్ డేట్" అనే మీటింగ్ కి పిల్చారు అందర్నీ – అదీ రీటాగారు ఊర్లో లేనప్పుడు. తెల్లమ్మాయికి ఆ మాత్రం బుర్ర ఉంది లెండి. అందువల్ల ఆవిడ ఊర్లో లేకుండా చూసుకున్నారు.

మీటింగ్ మొదలుపెట్టాక అప్పుడు తెల్సింది అందరికీ – ఇదంతా టీమ్ లీడ్ పెట్టిన నాటకం. సోడియం, పొటాషియం అవీ ఒకే ఒక రక్తం చుక్కలోంచి లాగాక ఈ "ఎండోఫేక్టర్" అనేది ఎలా లెక్క కడతారు అనేది ఒక పెద్ద ఈక్వేషన్ వేసి చూపించి ఆ ఈక్వేషన్ లో సోడియం ఎక్కడ, పొటాషియం ఎలా పనిచేస్తుంది, ఎంత "ఎండోఫేక్టర్" ఉంటే ఆరోగ్యానికి మంచిది, దానిమీద కొంత స్టాటిస్టిక్స్, గ్రాఫ్ లూ వగైరా. చివర్లో ప్రశ్నలూ సమాధానాలు, రిఫరెన్స్ లూ వగైరా. మొత్తం ప్రెజెంటేషన్ అయ్యేసరికి పరేష్ గారు తప్ప మిగతావారు కష్టాతి కష్టంగా నోర్లు నొక్కుకుని నవ్వు ఆపుకున్నారు. పరేష్ గారికి ఇది బ్రహ్మాండంగా నచ్చేసింది. చూపించిన ఈక్వేషన్లు, గ్రాఫ్ లూ అన్నీ రంగు రంగుల్తో అదిరిపోయేయి. చివర్లో ఈక్వేషన్ ఎలా పనిచేస్తుంది, అది కంప్యూటర్లోకి ఎలా ప్రోగ్రామ్ చేస్తారనేవి అడిగాడు. అన్నీ విన్నాక లేచి చెప్పాడు చివర్లో "చాలా బాగుంది. ఇటువంటిదే మనం చేయాలని చూస్తున్నాం కదా, అద్భుతం..." అన్నీ అయ్యాక బయటకి వచ్చిన మనవాళ్ళందరూ నవ్వుకుంటూన్నప్పుడు ఒక చైనా వాడు అడిగేడు, "ఈ ఐడియా ఎలా వచ్చింది మీకు? ఆయనకి "ఎండోఫేక్టర్" అనేదే లేదని తెలిస్తే గూబలు పగిలేవి కదా మనకి?" దానికి టీమ్ లీడ్ చెప్పాడు సమాధానం, "చూడు బ్రో, వీడో మార్కెటింగ్ కుర్రాడు లేదా వాడేసిన కార్లు అమ్మే సేల్స్ మేన్. వీడికి ఏమీ తెలియదని మేము మొదట్లోనే కనిపెట్టాం. అందువల్ల మేము ఏమీ భయపడలేదు. మరో విషయం అందరికీ తెల్సినదే కానీ ఎవరూ పైకి బాహాటంగా చెప్పనిది – ఈ కంపెనీ మరో ఏడాది లోపు మూతబడుతుంది. ఇప్పట్నుంచే వేరే జాబ్ వెతుక్కో. మన సి.ఒ.ఒ గారు ఎందుకూ పనికిరారు ఇక్కడ కానీ ఆయనో మిలియనీర్; ఇక్కడ ఖర్చుపెట్టే డబ్బులు ఆయనవి కాదు కదా, వెంచర్ కాపిటలిస్ట్ ల దగ్గిరనుంచి ఎత్తుకొచ్చినవి. వాళ్ళకీ, వీళ్ళకీ పోయినదేమీ లేదు; ఇందులో పెట్టిన మిలియన్లు అన్నీ పోయినా వాళ్ళకిదో సముద్రంలో కాకిరెట్ట, అంతే."

మరో ఏడాదికి సరిగ్గా దేశీ టీమ్ లీడ్ చెప్పినట్టే జరిగింది. కంపెనీ మూతపడుట, వెంచర్ కాపిటలిస్ట్ నుంచి గొడవలూ, మొత్తం డబ్బులన్నీ శ్రీమద్రమారమణ గోవిందో హరి. ఈ లోపున వేరే ఉద్యోగం దొరికినవాళ్ళకి దొరికింది లేనివాళ్ళు రోడ్డు మీద పడ్డారు. అయితే కంపెనీలో జరిగిన మోసం అంతా జనాల ఆరోగ్యం విషయానికి సంబంధించినది కనక ఫెడరల్ గవర్నమెంట్ వారు రంగంలోకి దిగి కేసు పెట్టారు. మరో ఏడు కేసు లాగాక రీటా అమ్మగారికి ఇన్నేళ్ళూ, పరేష్ గారికి

మరో ఇంతా అంటూ జైలు శిక్ష పడింది. వెంచర్ కాపిటలిస్ట్ లు పోయిన డబ్బులు పారు బాకీల కింద రాసుకుని నోరుమూసున్నారు. ఈ మొత్తం ప్రోజక్ట్ వెనక ఉన్న రాజకీయ పెద్దలు, మరో బలవంతులూ ఏమీ చేయలేక తలలు పట్టుకుని వేరు దారి వెతుక్కున్నారు. అయినా ఇవన్నీ జీవితం లో కలిగే సాధారణ ఒడిదుడుకులు; అవి ఎలా సర్దుకుంటాయో వారికి తెలుసు. పోయిన డబ్బులు వేరు దారిలో రాబట్టుకోవడమూ తెలుసు. ప్రస్తుతం పరేష్ గారు మినిమమ్ సెక్యూరిటీ ఉన్న శ్రీకృష్ణ జన్మ స్థానంలో ఉన్నారు. ఇంతకీ ఈయన ఎవరో కనిపెట్టారా? తెలియకపోతే ఈ వాక్యం గూగిలించుడు – "endofactor joke"

**నీతి: తన కంపెనీలోనే ఏం జరుగుతోందో తెలియనివాడు సి-లెవెల్ మేనేజర్ గా పనికిరాడు.**

Post your comments